
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 10 జనవరి 2024



కార్డుదారులందరికీ పొంగల్ కానుక

● నేడు ప్రారంభించనున్న సీఎం స్టాలిన్





పెరంబూర్, జనవరి 9: పొంగల్ పండుగ సందర్భంగా రూ.1,000 నగదుతో కూడిన కానుక పంపిణీని ఈనెల 10న బుధవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ఆస్తిపన్ను చెల్లించే వారు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, చక్కెరకార్డులు కలిగి సరుకులు పొందలేని వారికి సహా రూ.1,000 నగదు, కిలో పచ్చిబియ్యం, కిలోచక్కెర, చెరకు గడ అందజేయనున్నారు.

టోకెన్ల పంపిణీ...

పొంగల్ బహుమతుల కోసం రేషన్ దుకాణాల ముందు ప్రజల రద్దీని అడ్డుకొనేలా టోకెన్లు అందజేశారు. ఈనెల 7వ తేది నుంచి 9వరకు రేషన్ సిబ్బంది కార్డుదారుల ఇళ్లకే వెళ్లి టోకెన్లు అందించారు. సదరు కార్డుదారుడు ఏ రోజున, ఏ సమయాన రేషన్ దుకాణానికి వెళ్లి పొంగల్ బహుమతులు పొందవచ్చనే వివరాలు టోకెన్లలో ఉన్నాయి. టోకెన్లు పొందిన వారు బుధవారం నుంచి ఈనెల 14వ తేది పొంగల్ కానుకను పొందవచ్చు.

2.24 కోట్ల కార్డులు...

రాష్ట్రవ్యాప్తంగా 2.24 కోట్ల రేషన్ కార్డులుండగా, వాటిలో 4 లక్షల చక్కెర కార్డులు. ఇక, ప్రభుత్వ ఉద్యోగులు అని మరో 24 లక్షల కార్డులున్నాయి. ఈ కార్డులు కలిగిన వారు పొంగల్ కానులకు అనర్హులు. మిగిలిన 1.86 కోట్ల రేషన్ కార్డుదారులు పొంగల్ బహుమతులు అందుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పలు వర్గాలు, పార్టీల నుంచి అందిన వినతులతో అన్నిరకాల కార్డుదారులకు రూ.1,000 నగదుతో కూడిన పొంగల్ బహుమతి అందించనున్నట్లు సీఎం స్టాలిన్ మంగళవారం ప్రకటించారు. ఈ పథకంలో అందించే సరుకుల కొనుగోలుకు తొలివిడతగా రాష్ట్రప్రభుత్వం ఈనెల 4వ తేది రూ.239 కోట్లు విడుదల చేయగా, సోమవారం మిగిలిన రూ.1,828 కోట్లు కేటాయించింది.

ప్రారంభించనున్న సీఎం..

పొంగల్ కానుకల పంపిణీని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ప్రారంభించనున్నారు. ఆళ్వార్‌పేట శ్రీరాంనగర్‌లో ఉన్న రేషన్ దుకాణంలో జరిగే కార్యక్రమంలో సీఎం పాల్గొని, కార్డుదారులకు పొంగల్ కానుకలను అందించనుండగా, అనంతరం అన్ని రేషన్ దుకాణాల్లో రూ.1,000 నగదుతో కూడిన పొంగల్ కానుక ప్రారంభం కానుంది. అదే సమయంలో రేషన్ దుకాణాల వద్ద రద్దీ నియంత్రించేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

ఆగని బస్సులు

95 శాతం పరుగులు

కార్మికుల సమ్మె పాక్షికమే



కోయంబేడు బస్‌స్టేషన్ వద్ద భద్రతా విధుల్లో పోలీసులు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ పథకాన్ని రద్దు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, వేతన సంఘం సిఫారసులు అమలు చేయాలని కోరుతూ అన్నా కార్మిక సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ సహా 15 సంఘాలు చేపట్టిన సమ్మె ప్రభావం పాక్షికంగానే కనిపించింది. డీఎంకే కార్మిక సంఘం తొళిలార్ మున్నేట్ర సంఘం, ఐఎన్‌టీయూసీ, డీపీఐ అనుబంధ కార్మిక సంఘాలదే పైచేయిగా ఉండటం, పైగా ఈ సంఘాలన్నీ సమ్మెకు దూరంగా ఉండాలని నిర్ణయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో 95 శాతం బస్సులు నడిచాయి. అయితే అన్నా కార్మిక సంఘం, దాని మద్దతు సంఘాలు సమ్మెకు దిగడంతో డ్రైవర్ల కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని ముందే గ్రహించిన రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందిన డ్రైవర్లను రంగంలోకి దించింది. సోమవారం అర్ధరాత్రి నుంచే అన్నాకార్మిక సంఘం, దాని మద్దతు కార్మిక సంఘాలకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, డిపోల సిబ్బంది సమ్మెకు దిగారు. అదే సమయంలో రవాణా శాఖ మంత్రి శివశంకర్ పండుగ పూట సమ్మెను మానుకోమని పదే పదే ఆ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రవాణా కార్మికుల సమ్మెతో తీవ్ర ఇబ్బందులకు గురవుతామని ఆందోళన చెందిన ప్రజానీకం ఎట్టకేలకు సమ్మె ప్రభావం ఎక్కడా కనిపించకపోవడంతో ఊరట చెందింది. రాష్ట్రంలో మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో 16,144 బస్సులకుగాను 15322 సర్వీసులను నడిపినట్లు రవాణా శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. కొన్ని చోట్ల పోలీసుల భద్రతతో బస్సులు నడిపారు. అయితే ట్రైనీ కండక్టర్లు, డ్రైవర్లతో నడిపిన బస్సులు మాత్రం సమయపాలన పాలన పాటించకుండా నడిచాయి. కొన్ని చోట్ల ఒకేమార్గంలో వెళ్లే బస్సులు ఒకదాని వెనుక ప్రయాణికులు లేకుండా నడిచాయి.



కోయంబేడు బస్‌స్టేషన్‌లో నడుపుతున్న సిటీబస్సులు

చెన్నైలో...

రాజధాని నగరం చెన్నైలోనూ పూర్తి స్థాయి మహానగర రవాణా సంస్థ (ఎంటీసీ) బస్సులు నడిచాయి. నగరంలో రోజూ 3,233 సిటీ బస్సులు నడుపుతుండగా మంగళవారం ఉదయం 5 గంటలకే 3,092 బస్సులు నడిపారు. నగరంలోని 32 డిపోల్లో పూర్తిస్థాయిలో బస్సులు నడిపినట్లు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీ జాన్ వర్గీస్ తెలిపారు.

నేడు పూర్తిస్థాయిలో బస్సులు...

సమ్మె గురించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం కార్మిక సంఘాల డిమాండ్లను ఆమోదించేందుకు సిద్ధంగా ఉందని, పండుగ పూట సమ్మె వద్దని హితవు చెప్పినా కొన్ని కార్మిక సంఘాలు సమ్మెకు దిగటం శోచనీయమన్నారు. చెన్నై, కోయంబత్తూరు, మదురై, సేలం, తిరుచ్చి, తిరునల్వేలి, విల్లుపురం, తంజావూరు, కుంభకోణం, పుదుచ్చేరి, తిరుప్పూరు, హోసూరు, ధర్మపురి, నాగర్‌కోవిల్, కన్నియాకుమారి సహా అన్ని రవాణా సంస్థలలోనూ ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు, ఏసీ బస్సులు, ఆర్డినరీ బస్సులు యథావిధిగా నడిచాయన్నారు. కొన్ని డిపోలలో ఐదారుశాతం బస్సులు నడుపలేకపోయామని, బుధవారం నుంచి తాత్కాలిక సిబ్బందిని నియమించి బస్సులను పూర్తి స్థాయిలో నడుపుతామన్నారు.

ఉపముఖ్యమంత్రి పదవి ఉత్తిదే!

● మంత్రి ఉదయనిధి



చెన్నై నెహ్రూ స్టేడియంలో ఖేలో ఇండియా పోటీల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డీఎంకే యువజన మహానాడు ముగిసిన తర్వాత తనను ఉపముఖ్యమంత్రిగా నియమించనున్నారంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి కొట్టిపారేశారు. ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. తన తాత కరుణానిధి హయాంలో తన తండ్రి స్టాలిన్ యువజన విభాగం అధ్యక్షుడిగా పార్టీకి విశిష్టమైన సేవలందించటం వల్లే మంత్రిగా, డిప్యూటీ సీఎంగా నియమితులయ్యారని తెలిపారు. తన తండ్రికి విశేషానుభవం కలిగి ఉండటం వల్లే చెన్నై మేయర్‌గా, మంత్రిగా, ఆ తర్వాత డిప్యూటీ సీఎంగా, డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడిగా పలు పదవుల్లో రాణించ గలిగారన్నారు. ఇప్పుడు అదే బాటలో తాను కూడా ఉపముఖ్యమంత్రిని అవుతానని కొంతమంది భావిస్తున్నారన్నారు. తాను డీఎంకే యువజన విభాగ పగ్గాలు పట్టినప్పటి నుంచే ఇలాంటి ప్రచారం జరుగుతోందన్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని, ఆ తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్, పార్టీ సీనియర్ల అభిప్రాయం మేరకు తనకు మంత్రి పదవి వరించిందన్నారు. ఈ నెల 21న సేలంలో డీఎంకే యువజన విభాగం మహానాడు ముగిసిన తర్వాత తనకు ఉపముఖ్యమంత్రిగా పదోన్నతి వస్తుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఉదయనిధి పేర్కొన్నారు. ఇదిలా వుండగా మంగళవారం మంత్రి ఉదయనిధి నెహ్రూ స్టేడియానికి వెళ్లి ఉన్నతాధికారులతో కలిసి 'ఖేలో ఇండియా' పోటీల ఏర్పాట్లను పరిశీలించారు.

● మహిళా ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు

మాజీ డీజీపీకి హైకోర్టులో చుక్కెదురు

● విల్లుపురం కోర్టు తీర్పునకు గ్రీన్ సిగ్నల్

ప్యారీస్, జనవరి 9: మాజీ డీజీపీ రాజేష్‌దాస్‌కు వ్యతిరేకంగా దాఖలైన లైంగిక వేధింపుల కేసుపై విల్లుపురం సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుకు ఎలాంటి అభ్యంతరం లేదని మద్రాసు హైకోర్టు తన తీర్పులో తేల్చి చెప్పింది. ఓ మహిళా ఐపీఎస్ అధికారిని లైంగిక వేధింపులపాలు చేసినట్లు దాఖలైన కేసులో రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ విల్లుపురం సెషన్స్ కోర్టు గత 2023 జూన్ 16న తీర్పు వెలువరించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ రాజేష్ దాస్ విల్లుపురం సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఆ కేసుకు సంబంధించిన విచారణ, ఇరువర్గాల వాదనలు పూర్తయిన సందర్భంగా ఈనెల 6న తీర్పు వెలువరించనున్నట్లు విల్లుపురం కోర్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో, విల్లుపురం కోర్టులో ఉన్న ఆ కేసు విచారణను వేరే న్యాయస్థానానికి మార్చు చేయాలని కోరుతూ రాజేష్‌దాస్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుపై సోషల్ మీడియాలో ప్రసారమైన కథనాలు తనకు వ్యతిరేకంగా ఉన్నాయని, మరోసారి తన తరఫు వాదనలు వినిపించేందుకు విల్లుపురం సెషన్స్ కోర్టును అభ్యర్థించినా పట్టించుకోలేదని, ఆ కోర్టులోనే విచారణ కొనసాగితే తనకు న్యాయం జరగదని రాజేష్‌దాస్ హైకోర్టుకు వివరించారు. విల్లుపురం కోర్టు వెలువరించబోయే తీర్పును నిలుపుదల చేస్తూ స్టే ఉత్తర్వు జారీ చేయాలని కోరారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ తీర్పు వెలువరించారు. మహిళా ఐపీఎస్ అధికారిని లైంగికంగా వేధించినందుకు రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలుశిక్ష అప్పీలుపై విల్లుపురం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎలాంటి అభ్యంతరం లేదని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

● ఉప కులపతుల నియామక వ్యవహారం

సెర్చ్ కమిటీ నియామక ఉత్తర్వులు వెనక్కు

అడయార్, జనవరి 9: విశ్వవిద్యాలయాల ఉప కులపతులను నియమించేందుకు సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి వెనక్కు తీసుకున్నారు. ఈ మేరకు రాజ్‌భవన్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బందులు కుగకుండా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా సెర్చ్ కమిటీని గవర్నర్ వెనక్కు తీసుకున్నట్లు తెలుస్తోంది. సెర్చ్ కమిటీ నియామకానికి సంబంధించి గవర్నర్ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రేగుతున్న విషయం తెలిసిందే.

మైనార్టీల సంక్షేమం ద్రావిడ పాలన లక్ష్యం

ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నై సచివాలయంలో మైనారిటీ సంక్షేమంపై నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనార్టీలకు అండగా ఉంటూ వారిని సామాజికంగా, ఆర్థికపరంగా అభివృద్ధి పరచడమే డీఎంకే ద్రావిడ తరహా పాలన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. సచివాలయంలో మైనార్టీల సంక్షేమంపై మంగళవారం ఉదయం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... మైనార్టీలకు విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరచి, వారి హక్కులను పరిరక్షించి వారికి అందమైన భవిష్యత్తును కల్పించడమే తమ ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు. 2021లో తాను ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకూ మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశామన్నారు. ప్రత్యేకించి చర్చిల్లో పనిచేసే సేవకులు, సిబ్బంది కో సం వెల్ఫేర్ బోర్డు, వసతి గృహాల్లో మైనార్టీలకు చెందిన పండుగల సమయంలో ఆయా మతాలకు సంబంధించిన రుచికరమైన తినుబండారాలు, అల్పాహారాల పంపిణీ, జెరూసలేమ్ యాత్రకు వెళ్లే కన్యాస్త్రీలకు అందించే సబ్సిడీ పెంపు, మైనార్టీల సంక్షేమ సంస్థ ద్వారా భారీగా రుణాల మంజూరు అంటూ తమ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. వీటన్నింటికంటే క్రైస్తవులుగా మతం మార్చుకున్న ఆదిద్రావిడులకు రిజర్వేషన్ తదితర సదుపాయాలు కల్పించేలా చట్ట సవరణ బిల్లును గత యేడాది ఏప్రిల్‌లో శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేశామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు దురైమురుగన్, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఉదయనిధి, ముత్తుసామి, గీతా జీవన్, పీకే శేఖర్‌బాబు, సెంజి కేఎస్ మస్తాన్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, శాసనసభ్యుడు ఇనికో హృదయరాజ్, మైనారిటీల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు పీటర్ అల్ఫోన్స్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, మైనార్టీల సంక్షేమ శాఖ కార్యదర్శి రీటా హరీష్‌తక్కర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బిషప్‌లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయండి

జిల్లా నేతలకు ఈపీఎస్ పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి - సమావేశానికి హాజరైన జిల్లా శాఖ కార్యదర్శులు, మాజీ మంత్రులు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో వీలైనంత త్వరగా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని జిల్లా కార్యదర్శులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆదేశించారు. స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం ఈపీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చెన్నై నగర పరిధిలోని జిల్లా శాఖ కార్యదర్శులు బాలగంగా, డి.జయకుమార్, కేపీ కందన్, ఆదిరాజారామ్, విరుగై వీఎన్ రవి, ఆర్ఎల్ రాజేష్, వెంకటేష్ ప్రభు, టి.నగర్ సత్యా, అశోక్ సహా 12 జిల్లాశాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. వీరితోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన 60 మందికి పైగా జిల్లా శాఖ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహ రచనలపై సమగ్రంగా చర్చించారు. ప్రస్తుతం జిల్లా శాఖ నాయకులంతా ఏయే పార్టీలతో కూటమి కుదుర్చుకోవాలనే విషయాన్ని పక్కన బెట్టి లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ఈపీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకించి నియోజకవర్గాలవారీగా పటిష్ఠ బూత్ కమిటీలను, బూత్ కమిటీ ఇన్‌ఛార్జులను నియమించాలని ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, పనిచేయని స్థానిక నాయకులు గురించి ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి జిల్లా నేతలు సమాచారం అందించాలన్నారు. అవసరమైన ప్రతివారం నివేదికలు రూపొందించి తన పరిశీలనకు పంపితే ఇంకా మంచిదని చెప్పారు. జిల్లా శాఖ నాయకులు, నగరశాఖల నాయకులు, చివరకు వార్డు శాఖల నాయకులు కూడా ప్రజలతో మమేకం కావాలని, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. అదే సమయంలో డీఎంకే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అవసరం మేరకు కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని ఈపీఎస్ సూచించారు. వీధుల్లో సభలు నిర్వహించాలని, జిల్లా శాఖల ఆధ్వర్యంలో నగరాల్లో పార్టీ ప్రచార సభలు నిర్వహించాలన్నారు. వీటికి మాజీ మంత్రులు, జిల్లా నేతలు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎవరనే విషయం పట్టించుకోకుండా పార్టీ గెలుపే ప్రధానమనే భావనతో నేతలు పనిచేయాలన్నారు. ఆయా నియోజకవర్గాలలో ప్రజాభిమానం మెండుగా, ఆర్థిక, అంగ బలం కలిగిన అభ్యర్థులను గుర్తించి అధిష్ఠానానికి వారి పేర్లను సిఫారసు చేయాలన్నారు. ఇప్పటి నుంచే ప్రతి జిల్లా శాఖ కార్యదర్శి నియోజకవర్గాల వారీగా పార్టీ తరఫున అన్ని అర్హతలు కలిగిన అభ్యర్థుల జాబితాను తయారు చేసి పంపాలని ఈపీఎస్ కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించే పరిస్థితులు కనిపిస్తున్నాయని, అదే సమయంలో పార్టీ గురించి విస్తృత ప్రచారం సాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక పార్టీ కోసం పనిచేయని కొంతమంది జిల్లా శాఖ నాయకులను ఈపీఎస్ తీవ్రంగా మందలించారు. ఇకనైనా పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని హితవు పలికారు. సుమారు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సాగించాల్సిన ప్రచారం గురించి చర్చించారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 9: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా స్థానిక ఐటీ కారిడార్ పరిధిలోని సిరుచ్చేరి, సెవందియమ్మన్ ఆలయవీధి,పెరుమాళ్ ఆలయ వీధి, కుయవర్ వీధి, మాంతోపు వీధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఐసిఎఫ్, జనవరి 9: స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని పుళల్ నీటి శుద్ధీకరణ కేంద్రం నుంచి వెళ్లే పైప్ లైన్ అనుసంధాన పనులు చేపట్టనున్న కారణంగా బుధవారం మాధవరం, తండయార్‌పేట, తిరువికనగర్ మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. మాధవరం మండలంలో తనికాచలం నగర్, భోగరాజ్ నగర్, తండయార్ పేట మండలంలో ముత్తమిళ్ నగర్, కన్నదాసన్ నగర్, వ్యాసర్పాడి, కొడుంగైయూర్, తిరువికనగర్ మండలంలో కన్నికాపురం ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నారు. అత్యవసర సేవలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

పత్రాల రిజిస్ట్రేషన్‌కు లంచమా?

● ఫిర్యాదుకు సెల్‌ఫోన్ నెంబర్లు, ఈ-మెయిల్

పెరంబూర్, జనవరి 9: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు లంచం అడిగితే, ఫిర్యాదు చేసేలా ఈ-మెయిల్, సెల్‌ఫోన్ నెంబర్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి మూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు 10 వేల పత్రాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పించామన్నారు. అవినీతిని అడ్డుకొనేలా దళారులు, ఏజెంట్లను రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో అనుమతించడం లేదన్నారు. అవినీతి కారణంగా మూడేళ్ల క్రితం రూ.10,000 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరేదని, అనంతరం చేపట్టిన మార్పులతో ప్రస్తుతం రూ.17,927 కోట్లకు ఆదాయం పెరిగిందని తెలిపారు. రిజిస్ట్రేషన్లకు లంచాలు అడగడం, అధికారులు, కార్యాలయ సిబ్బంది చేతివాటం, దళారుల ప్రమేయం తదితరాలపై ప్రజలు నెం. 9498452110, 9498452120, 9498452130లలో గానీ, ctsec@tn.gov.in ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని మంత్రి తెలిపారు.

రేపు పంచవటి ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం

ఐసిఎఫ్, జనవరి 9: దిండివనం - పుదుచ్చేరి రహదారిలో ఉన్న పంచవటి అంజనేయ స్వామికి ఈనెల 11వ తేది 2,000 లీటర్ల పాలాభిషేకం జరగనుంది. పంచవటి ఆలయంలో వలంపురి వినాయకుడు, పట్టాభిషేక రామచంద్రమూర్తి, వేంకటాచలపతి, 36 అడుగుల విశ్వరూప పంచముఖ ఆంజనేయస్వామి కొలువుదీరి ఉన్నారు. ఇక్కడ ఈ నెల 7వ తేది ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలు గురువారం వరకు జరగనున్నాయి. లక్షార్చన, ప్రత్యేక పూజలు ప్రతిరోజు నిర్వహిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు విశ్వరూప దర్శనం, ఉదయం 6 గంటలకు యాగశాల పూజ, 8.30 గంటలకు క్షీరాభిషేకం, సుగంధద్రవ్యాలతో విశేష తిరుమంజనం నిర్వహిస్తారు. అభిషేక మంత్రం 130 కిలోల యాలకుల మాలను స్వామివారికి ధరింపజేసి పూజలు నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం జరగనుంది.

16న పనిచేయనున్న వండలూరు జంతు ప్రదర్శనశాల

ఐసిఎఫ్, జనవరి 9: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వండలూరు జూ పార్కు ఈనెల 16వ తేది (మంగళవారం) తెరచి ఉంచుతామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళవారం జంతు ప్రదర్శనశాలకు సెలవు. ఈ నేపథ్యంలో, తిరువళ్లూర్ డే సందర్భంగా సందర్శకుల సౌకర్యార్థం మంగళవారం పార్కును తెరచి ఉంచనున్నారు. సందర్శకులు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, సంచులు, ఆహార పదార్థాలు, చెరకు, పొగాకు ఉత్పత్తులు, మద్యం సీసాలు, మారణాయుధాలను తీసుకురావద్దని హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

వేకువజామున 1 గంటకే తిరుచెందూరు సుబ్రమణ్యస్వామి దర్శనం

ఐసిఎఫ్, జనవరి 9: సంక్రాంతి రోజున తిరుచెందూర్ సుబ్రమణ్య స్వామి ఆలయాన్ని వేకువజామున 1 గంటకు తెరచి స్వామి దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆ ప్రకారం, 15వ తేది ఈ ఆలయంలో 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, 4 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఇతర జాము పూజలు నిర్వహించనున్నారు.

తగ్గిన పూల ధరలు

ఐసిఎఫ్, జనవరి 9:కోయంబేడు మార్కెట్లో పూల ధరలు తగ్గాయి.వారంరోజులుగా ఆకాశన్నంటిన ధరలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ముహూర్త దినాలు లేకపోవడంతో తగ్గుముఖం పట్టాయి. గతవారం కిలో రూ.2,300కు విక్రయమైన మల్లెపూలు రూ.1,100, కిలో రూ.1,800కు విక్రయమైన ఐస్‌మల్లె రూ.1,000, రూ.1,200గా ఉన్న కనకాంబరం రూ.600, రూ.1,200గా ఉన్న ముల్లె రూ.500, రూ.900గా ఉన్న జాజి మల్లెలు రూ.300, రూ.350గా ఉన్న గన్నేరు పూలు రూ.150, రూ.100గాఉన్న చామంతి రూ.30,రూ.250గా ఉన్న సంపంగి రూ.60, రూ.140గా ఉన్న పన్నీర్‌రోజ్ రూ.30, రూ.160గా ఉన్న చాక్లెట్ రోజ్ రూ.50కి విక్రయమవుతున్నాయి.

23న పాత వాహనాల వేలం

ఐసిఎఫ్, జనవరి 9: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న పాత వాహనాలను ఈ నెల 23వ తేది వేలం వేయనున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. మదురై, తంజావూరు, ఎగ్మూర్ సీబీసీఐడీ కార్యాలయాల్లో నిర్వహించే ఈ వేలంలో పాల్గొనే వారు రూ.2,000 ధరావతు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. వేలం అనంతరం జీఎస్‌టీతో కలిపి నగదు చెల్లించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలి. ఇతర వివరాలకు 9384847273 (ఎగ్మూర్), 8300013340 (మదురై), 9488112277 (తంజావూరు) నెంబర్లలో సంప్రదించవచ్చు.

13 నుంచి 'చెన్నై సంగమం నమ్మ ఊరు తిరువిళా'

పెరంబూర్, జనవరి 9:ఈఏడాది 'చెన్నై సంగమం నమ్మఊరుతిరువిళా' ఈనెల 13నుంచి 17వతేదివరకు చెన్నైలోని పలు ప్రాంతాల్లో జరగనున్నాయి. సుమారు 1,500 కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఒయిలాట్టం సహా పలు కళా రూపాలు ఈ ప్రదర్శనలో చోటుచేసుకోనున్నాయి. ఐలాండ్ గ్రౌండ్‌లో ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆవడి కమిషనరేట్‌లో రెండు పోలీస్ స్టేషన్ల విలీనం

ఐసిఎఫ్, జనవరి 9: తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న రెండు పోలీస్‌స్టేషన్లు ఆవడి పోలీసు కమిషనరేట్‌తో విలీనమయ్యాయి. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్ పరిధి నుంచి కొత్తగా తాంబరం, ఆవడి కమిషరేట్లు ఏర్పాటు చేశారు. తాంబరం కమిషనరేట్ ఆధ్వర్యంలో 20 స్టేషన్లు, ఆవడి కమిషనరేట్‌లో తిరువళ్లూర్ జిల్లా నుంచి వెల్లవేడు, సెవ్వాయ్‌పేట, చోళవరం, మీంజూరు, కాట్టూరు అని ఐదు స్టేషన్లు విలీనం కాగా, ప్రస్తుతం నిర్వహణ సౌకర్యార్థం అదే జిల్లాలో ఉన్న పొన్నేరి, తిరుపాళయం పోలీస్‌స్టేషన్లను విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

దేశంలో తగ్గిన పేదరికం

● కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రంజన్‌సింగ్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

పెరంబూర్, జనవరి 9: కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో దేశంలో 13.5 కోట్ల మంది దారిద్ర్యరేఖ నుంచి బయటపడ్డారని కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ తెలిపారు. రామనాథపురం జిల్లా ఇలమనూరులో సోమవారం 'మన లక్ష్యం...అభివృద్ధి చెందిన భారతం' అనే పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ చర్యల కారణంగా దేశంలో 32.59 శాతంగా ఉన్న పేదరికం 19.28 శాతానికి తగ్గిందన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థితికి చేరుకున్నామన్నారు. 1,424 లక్షల టన్నుల సరుకులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. 325 మిలియన్ డాలర్ల విలువైన సరుకులు విదేశాలకు ఎగుమతి చేశామని తెలిపారు. వ్యవసాయం రంగంలో మౌలిక వసతుల కల్పనకు రూ.లక్ష కోట్లు కేటాయించామన్నారు. జాతీయ విద్యా విధానానికి రూ.630 కోట్లు కేటాయించగా, 1.38 కోట్ల మందికి రుణాలతో కూడిన వృత్తి విద్యా శిక్షణ అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

ఓబీసీ వర్గాల సమస్యలు పరిష్కరించండి

● ఎంపీ బీద మస్తాన్‌రావు

పెరంబూర్, జనవరి 9: ఓబీసీ వర్గాల సమస్యలు పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఓబీసీ వర్గాల సంక్షేమ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు హరినాథ్‌సింగ్ యాదవ్ రెండు రోజుల పర్యటనకు చెన్నైకి చేరుకున్నారు. ఆయన్ను ఎంపీ బీద మస్తాన్‌రావు, ద్రవిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు, తమిళనాడు యాదవ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ జి.రామచంద్ర యాదవ్ మర్యాదపూర్వకంగా కలుసుకొని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ... ఓబీసీ వర్గాల సంక్షేమ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడిని కలుసుకొని, ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేశామన్నారు. దేశంలో కుల గణన చేపట్టి ఓబీసీల పరిస్థితులు అంచనా వేయాలని, రిజర్వేషన్ అమలు, క్రీమిలేయర్ ప్రమాణాలు సమీక్షించి ఆదాయ పరిమితి పెంపు, ఓబీసీ వర్గాల పదోన్నతిపై రాజ్యాంగ సవరణ, ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ఓబీసీల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్, చట్టసభల్లో రిజర్వేషన్, విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ, కులాల వారీగా ప్రత్యేక ప్రణాళిక అమలు తదితరాలను పరిష్కరించాలని పేర్కొన్నామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు మస్తాన్‌రావు తెలిపారు.



హరినాథ్ సింగ్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, వి.కృష్ణారావు, రామచంద్ర యాదవ్

పబ్లిక్ పరీక్షల తేదీల్లో మార్పులేదు

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, జనవరి 9: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఇదివరకే ప్రకటించిన తేదీల్లోనే 10,12 పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నిర్వహణ, తుఫాను, భారీ వర్షాలతో పాఠశాలలు మూతపడడం తదితర కారణాలు పరిగణలోకి తీసుకొని పబ్లిక్ పరీక్షల తేదీలను మార్చుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలపై మంత్రి అన్బిల్ మహేష్ స్పందిస్తూ... ఇప్పటికే ప్రకటించిన తేదీల ప్రకారం పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు నిర్వహించే తేదీలను ఇప్పటికే జాతీయ ఎన్నికల కమిషన్‌కు తెలియజేశామని, ఆ ప్రకారం, ఆ తేదీల అనంతరం ఎన్నికల నిర్వహించే అవకాశముందని భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అందించనున్న ఉపకారవేతనం వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి తెలిపారు.

పబ్లిక్ పరీక్షల షెడ్యూల్... : టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి 29వ తేది వరకు, రాత పరీక్ష మార్చి 26 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు జరుగున్నాయి. అలాగే, ప్లస్ వన్ తరగతి సంబంధించి ఫిబ్రవరి 19 నుంచి 24వ తేది వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 4 నుంచి 23వ తేది వరకు నిర్వహించనున్నారు. ఇక, ప్లస్ టూ తరగతి ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి 17వ తేది వరకు, రాతపరీక్ష మార్చి 1 నుంచి 22వ తేది వరకు జరగనున్నాయి. రాతపరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు జరుగనున్నాయి. టెన్త్ ఫలితాలు మే 10వ తేది, ప్లస్ వన్ పరీక్షా ఫలితాలు మే 14న, ప్లస్ టూ పరీక్షా ఫలితాలు మే 6వ తేది విడుదల చేయనున్నారు.



చెన్నై సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యా వ్యవహారాలకు సంబంధించి 'నలమ్ నాడి' యాప్‌ను పరిచయం చేస్తున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ఉన్నతాధికారులు

అప్పుడు అదానీని దూషించినవారే... ఇప్పుడు పొగుడుతున్నారు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, జనవరి 9: రాష్ట్రంలో రాజకీయాలు పక్కన పెట్టిన కొన్ని పార్టీలు, రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడాలని ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడు తెలియజేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. నగరంలో ఆది, సోమవారాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడులో దేశ, విదేశాలకు చెందిన సంస్థలు సుమారు రూ.6.64 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ మహానాడుపై అన్నామలై మంగళవారం స్పందిస్తూ... గత ఎన్నికల సమయంలో డీఎంకే నేతలు అదానీ గ్రూపు గురించి పలు ఆరోపణలు చేశారన్నారు. అదాని మోదీ ఆస్తి అని, ఆయనకు బీజేపీతో సంబంధాలున్నాయని, పార్టీకి నిధులు అందిస్తున్నట్టు ప్రకటనలు చేశారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుతం అదే అదానీ సంస్థ రాష్ట్రంలో రూ.42,768 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంతో సీఎం తన ఎక్స్‌లో అభినందనలు తెలుపుతున్నారన్నారు. కానీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రూ.33.51 లక్షల కోట్ల పెట్టుబడులు పొందిన నేపథ్యంలో, రాష్ట్రంలో మాత్రం రూ.6.64 లక్షల కోట్లు మాత్రమే సమీకరించం ఏంటి? అని అన్నామలై ప్రశ్నించారు.

చర్చిలో అన్నామలై ప్రవేశాన్ని అడ్డుకున్న యువకులు



చర్చిలోకి అన్నామలైను వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న యువకులు

పెరంబూర్, జనవరి 9: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను చర్చిలోకి వెళ్లనివ్వకుండా యువకులు అడ్డుకున్నారు. 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పేరుతో అన్నామలై చేపట్టిన పాదయాత్ర ధర్మపురి జిల్లాలో సాగుతోంది. అందులో భాగంగా సోమవారం పాపిరెడ్డిపట్టికి చేరుకున్న అన్నామలై, ఆ ప్రాంతంలోని లూర్దుమలై అన్నై మేరీ చర్చిలోకి వెళ్తుండగా ప్రవేశద్వారం వద్ద యువకులు అడ్డుకున్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు బీజేపీయే కారణమని, ఆ పార్టీకి చెందిన వారు మేరీ మాతకు పూలమాల వేసేందుకు అనుమతించమని యువకులు చెప్పారు. అన్నామలై సర్ది చెప్పబోయినా వారు వినలేదు. భద్రతా విధులో ఉన్న పోలీసులు ఆ యువకులను అక్కడి నుంచి పంపించి వేయడంతో, అన్నామలై చర్చిలోకి వెళ్లి మేరీమాత విగ్రహానికి పూలమాల వేసి తిరిగి వెళ్లిపోయారు.

జల్లికట్టు పోటీల విజేతలకు బహుమతిగా ట్రాక్టర్లు

● డాక్టర్ అన్బుమణి సూచన

పెరంబూర్, జనవరి 9: జల్లికట్టు విజేతలకు ట్రాక్టర్లు బహుమతిగా అందించాలని పీఎంకే ప్రధాన కార్యదర్శి డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రభుత్వానికి సూచించారు. పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో తమిళుల సంప్రదాయ, సాహస క్రీడ జల్లికట్టు నిర్వహిస్తుంటారు. ఈ పోటీల్లో ఎక్కువ ఎద్దులు లొంగదీసిన వీరులకు కార్లు, మోటర్ సైకిళ్లు సహా పలు వస్తువులు బహుమతిగా అందిస్తున్నారు. అలంగానల్లూర్ జల్లికట్టు పోటీ విజేతలకు కారు బహుమతిగా ఇస్తున్నట్లు మంత్రి మూర్తి ప్రకటించారు. దీనిపై అన్బుమణి స్పందిస్తూ... ఈ పోటీల్లో అధికంగా రైతు కుటుంబాలకు చెందిన యువకులు పాల్గొంటారని, అలాంటి వారికి కారు కన్నా వారుచేసే వ్యవసాయానికి వినియోగపడేలా ట్రాక్టర్లు బహుమతిగా అందించాలని ఆయన రాష్ట్రప్రభుత్వం, నిర్వాహకులకు సూచించారు.

ఐదుగురు పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, జనవరి 9: తాంబరం కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసే ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అమల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. బీర్కన్‌కారనై శాంతి భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ నెడుమారన్... పళ్లికరనై శాంతి భద్రతల విభాగానికి, చిట్లపాక్కం శాంతి భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ మకుటేశ్వరి ... సెమ్మంజేరి శాంతి భద్రతల విభాగానికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసే మురుగన్ కానాత్తూర్ శాంతి భద్రతల విభాగానికి, కానాత్తూర్‌లో పనిచేసే పార్థసారథి కేంద్ర క్రైం విభాగానికి, అక్కడకున్న రామదాస్ కిళంబాక్కం క్రైం విభాగానికి, బీర్కన్‌కానైనై ట్రాఫిక్ విభాగం ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్ సెమ్మంజేరి ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయ్యారు.

13న వెంకటేశ్వర నగర్‌లో ఆండాళ్ తిరుకల్యాణోత్సవం

ప్యారీస్, జనవరి 9: స్థానిక కొడుంగైయూర్ వెంకటేశ్వర నగర్‌లోని సిద్ధివినాయక శ్రీనివాస వెంకటముడయాన్ తిరుకోయిల్ సేవార్థిగళ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేది సాయంత్రం 6 గంటలకు ఆండాళ్ తిరు కల్యాణోత్సవం జరగనుంది. ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి ప్రత్యేక పూజలు, మార్గళి భజన, విష్ణు సహస్రనామ పారాయణం, లోక కల్యాణార్థం విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజల్లో పాల్గొని దైవాశీస్సులు పొందాలని భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు కోరారు. ఈనెల 26వ తేది 300 మందికి పైగా శ్రీవారి భక్తులు ఆలయం నుంచి తిరుమలకు పాదయాత్రగా బయల్దేరుతారని సంఘం అధ్యక్షుడు బోడి శ్రీనివాసులు తెలిపారు.

12న మంత్రి సెంథిల్ బాలాజి బెయిలుపై తీర్పు

పెరంబూర్, జనవరి 9: మంత్రి సెంథిల్ బాలాజి మూడో సారి బెయిలు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 12వ తేది తీర్పు వెలువరించనున్నట్లు చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చట్టవ్యతిరేక నగదు బదిలీ చట్టం కింద గత ఏడాది జూన్ 14వ తేది మంత్రిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఆయన రెండు సార్లు దాఖలు చేసిన బెయిలు పిటిషన్లను చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో, బెయిలు కోరుతూ మూడో సారి దాఖలుచేసిన బెయిలు పిటిషన్‌ను సోమవారం చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లి విచారించారు. మంత్రికి ఉన్న సంబంధాలు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని, ఆయనకు బెయిలు ఇవ్వరాదని ఈడీ తరఫున హాజరైన న్యాయవాది తెలిపారు. ఈ కేసు మళ్లీ మంగళవారం విచారణకురాగా ఇరుతరఫు వాదనలు ముగిసిన నేపథ్యంలో, బెయిలుపై తీర్పును ఈనెల 12న ప్రకటించనున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

సగం మంది డీఎంకే మంత్రులు జైలుకే


● బీజేపీ నేత హెచ్.రాజా


పెరంబూర్, జనవరి 9: రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలు జరిగే లోపు డీఎంకేకు చెందిన సగం మంది మంత్రులు జైళ్లలో ఉంటారని బీజేపీ మాజీ జాతీయ కార్యదర్శి హెచ్.రాజా చెప్పారు. శివగంగలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో ఏర్పాటు కానున్న కూటమి పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తుందన్నారు. 'ఇండియా' కూటమి పార్టీల్లో ఐక్యత లేదన్నారు. కేరళలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి పోటీచేసే అవకాశం లేదని, దానిని బట్టి ఆ కూటమి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అయోధ్య రామాలయం కుంభాభిషేకం జరిగే సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో విశేష పూజలు, కుంభాభిషేక ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ చర్యలు చేపట్టాలని హెచ్.రాజా డిమాండ్ చేశారు.

'అధికార పార్టీ చిహ్నంతో కూటమి పార్టీల పోటీపై నిషేధం విధించలేం'

పెరంబూర్, జనవరి 9: అంగీకారం పొందిన రాజకీయ పార్టీ చిహ్నంతో కూటమి పార్టీలు పోటీ చేయడంపై నిషేధం విధించలేమని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దేశీయ మక్కల్ కట్చి అధ్యక్షుడు ఎం.ఎల్. రవి హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... కూటమి చిహ్నంపై పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు చెల్లదని ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జోక్యం చేసుకోలేమని, దీనిని ఎన్నికల కేసుగా మాత్రమే కొనసాగించాలని పేర్కొన్న న్యాయస్థానం, పిటిషన్ కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

ఏర్కాడులో ఓ వైపు మంచు... మరోవైపు జల్లు





చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతం ఏర్కాడులో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు తోడు దట్టమైన మంచు ఆవరించడంతో ప్రజలు చలితో తీవ్రంగా వణికిపోతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో చిరుజల్లులు పడుతున్నాయి. ఉదయం 10 గంటల దాకా వాన జల్లులతోపాటు మంచు కురుస్తుండటంతో అక్కడి పర్యాటక ప్రాంతాలు జనం లేక బోసిపోతున్నాయి. ఇదే విధంగా జిల్లాలోని ఎడప్పాడి, తలైవాసల్, తమ్మంబట్టి, కరియకోవిల్ తదితర ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తోంది.

రేపటి నుంచి కేంద్ర బృందం పర్యటన

ఐసిఎఫ్, జనవరి 9: వరద బాధిత దక్షిణ జిల్లాల్లో కేంద్ర బృందం ఈనెల 11 నుంచి నాలుగు రోజులు పర్యటించి నష్టం అంచనా వేయనుంది.తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి, తెన్‌కాశి జిల్లాలు గత నెలలో కురిసిన భారీవర్షాలకు ధ్వంసమయ్యాయి. అదే నెలలో 20, 21 తేదీల్లో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం పరిశీలించింది. ఈ నేపథ్యంలో, మళ్లీ ఏడుగురితో కూడిన కేంద్ర బృందం నాలుగు జిల్లాల్లో పర్యటించనుంది. మొదట కలెక్టర్లతో సమావేశమైన అనంతరం బాధిత ప్రాంతాలను సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు.



కాశిమేడు చేపలరేవు వద్ద మంగళవారం ఉదయం సముద్రతీరం పొడవునా ఏర్పడిన నురగ

కొడనాడు హత్య, దోపిడీ వ్యవహారం
16న గుజరాత్ ఫోరెన్సిక్ బృందం రాక

పెరంబూర్, జనవరి 9: కొడనాడు హత్య, దోపిడీకి సంబంధించి ఈనెల 26న గుజరాత్ ఫోరెన్సిక్ బృందం పరిశోధనలు చేపట్టనుంది. నీలగిరి జిల్లా కోతగిరి సమీపం కొడనాడు ఎస్టేట్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత, శశికళకు సొంతమైన బంగ్లా ఉంది. ఈ బంగ్లాలో 2017లో హత్య, దోపిడీ జరిగాయి. సేలం ఆత్తూర్‌కు చెందిన కనకరాజ్ నేతృత్వంలో ముఠా ఈ ఘటనలకు పాల్పడి ఉంటారనే వార్తల నేపథ్యంలో, కనకరాజ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి విచారణ చేపట్టిన పోలీసులు సయాన్, మనోజ్ సహా కేరళకు చెందిన 10 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసు ఊటీ సెషన్స్ కోర్టు విచారణలో ఉంది. ఈ కేసు సీబీసీఐడీ విచారణకు ఆదేశించగా, ఆ విభాగం ఏడీఎస్పీ మురుగవేల్ నేతృత్వంలో 49 మందితో కూడిన అధికారుల బృందం విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసులో సెల్‌ఫోన్ సంభాషణలు పరిశీలించేందుకు ఈనెల 26న గుజరాత్ ఫోరెన్సిక్ విశ్వవిద్యాలయ నిపుణుల బృందం రాష్ట్రానికి రానుంది. 19 టవర్ల ద్వారా 60 సెల్‌ఫోన్ నెంబర్ల నుంచి జరిగిన సంభాషణలను ఈ బృందం పరిశోధించనుంది. కాగా, ఈ కేసులో నిందితులకు సీబీసీఐడీ పోలీసులు మళ్లీ సమన్లు జారీ చేశారు. నిందితుల సెల్‌ఫోన్లు పరిశీలించి 8,000 పేజీల నివేదికను గత వారం సీబీసీఐడీకి అందజేశారు. నిందితుల సంభాషణ వివరాలతో కూడిన ఈ నివేదిక ప్రకారం, మళ్లీ వారిని విచారించేందుకు సమన్లు జారీ అయ్యాయి. ఈనెల 11వ తేది నుంచి విచారణకు హాజరుకావాలని సమన్లలో సీబీసీఐడీ పేర్కొంది.

నేడు అంకిత్ తివారి కేసులో ఏసీబీ, ఈడీ పిటిషన్లపై నిర్ణయం

పెరంబూర్, జనవరి 9: దిండుగల్‌లో రూ.20 లక్షలు లంచం తీసుకున్న కేసులో ఈడీ అధికారి అంకిత్ తివారిని విచారించేందుకు కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దాఖలు చేసిన పిటిషన్ విచారణను దిండుగల్ క్రిమినల్ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఈడీ విచారణ సమయంలో తమ అధికారులు కూడా ఉండేలా అనుమతించాలని అవినీతి నిరోధక శాఖ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో, అవినీతి నిరోధక శాఖ పిటిషన్ తీసుకోవాలా? వద్దా? అనే విషయమై బుధవారం నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి మేఘన తెలిపారు.

రాహుల్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు... ఎంపీ కార్తికి టీఎన్‌సీసీ నోటీసులు

వేళచ్చేరి, జనవరి 9: ప్రధాని మోదీతో రాహుల్‌గాంధీని పోలుస్తూ మాట్లాడిన, శివగంగ ఎంపీ కార్తికి తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) క్రమశిక్షణ చర్యల కమిటీ నోటీసు జారీ చేసింది. టీఎన్‌సీసీ అధ్యక్ష పదవికి తనను ఎంపిక చేస్తూ పార్టీని ప్రగతి పథంలోకి తీసుకెళ్తానని వ్యాఖ్యలు చేస్తున్న కార్తి, కాంగ్రెస్ అధిష్ఠానం అభిప్రాయాలకు ఎప్పటికప్పుడు వ్యతిరేక అభిప్రాయాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు చానల్‌కు ఇంటర్వ్యూలో కార్తి, 'దేశంలో ప్రధాని మోదీ లాంటి నాయకులు ఎవ్వరూ లేరని' బహిరంగంగా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీతో రాహుల్‌ని పోల్చుతూ మాట్లాడిన శివగంగ ఎంపీ కార్తికి టీఎన్‌సీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ నోటీసు పంపించింది.

జల్లికట్టు క్రీడా మైదానికి కలైంజర్ పేరు

● మంత్రి ఏవీ వేలు

అడయార్, జనవరి 9: మదురై జిల్లాలోని అలంగానల్లూరులో నిర్మించిన జల్లికట్టు క్రీడా మైదానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరును పెడతామని మంత్రి ఏవీ వేలు తెలిపారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం మాట్లాడుతూ... ఈ జల్లికట్టు క్రీడా మైదానాన్ని రూ.61 కోట్లతో 66 ఎకరాల్లో నిర్మాణం చేపట్టగా పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ క్రీడా మైదానాన్ని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. దేశంలో జరిగే సాహసక్రీడా పోటీల్లో ఒకటైన జల్లికట్టు ఒక్క తమిళనాడులోనే జరుగుతాయన్నారు. ముఖ్యంగా మదురై నగరం ఇందుకు ప్రసిద్ధిగాంచిందన్నారు.ఈక్రీడా పోటీలను ప్రపంచ స్థాయిలో తీసుకెళ్ళేందుకు వీలుగా ఈ క్రీడామైదానాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు.

విద్యా, ఉద్యోగాల్లో హిజ్రాలకు అంతర్గత రిజర్వేషన్లు

● పరిశీలించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచన

పెరంబూర్, జనవరి 9: విద్యా, ఉద్యోగ అవకాశాల్లో హిజ్రాలకు అంతర్గత రిజర్వేషన్లపై ప్రభుత్వం పరిశీలించాలని మద్రాసు హైకోర్టు సూచించింది. ఇదివరకే సుప్రీంకోర్టు హిజ్రాలకు ఓటరు గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు, విద్యా సంస్థల్లో వారు చేరేలా చర్యలు చేపట్టాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా అంతర్గత రిజర్వేషన్లు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తూత్తుకుడికి చెందిన గ్రేస్ భాను గణేశన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, ప్రభుత్వ అభిప్రాయం తెలియజేయాలని ఉత్తర్వులు జారీచేస్తూ, తదుపరి విచారణ మార్చి 4వ తేదీకి వాయిదావేసింది.

అర్హులైన వారిని ఆరు వారాల్లో నియమించాలి

● సర్కారుకు హైకోర్టు ఆదేశం

అడయార్, జనవరి 9: కార్మికుల సంక్షేమం, ఆరోగ్య శాఖ సంచాలకులు (డైరెక్టర్)గా అర్హులైన ఉన్నతాధికారిని ఆరు వారాల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఆరోగ్య శాఖ సంచాలకుడిగా సెంథిల్ కుమార్ 2020లో నియమించారు. అయితే, సీనియర్లను కాదని సెంథిల్‌కుమార్‌ను సర్కారు నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆరోగ్య శాఖ అడిషినల్ డైరెక్టర్ రాజశేఖరన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై పలు దఫాలుగా విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల వాదనలు ఆలకించిన కోర్టు... పదోన్నతలకు సంబంధించిన నియమ నిబంధనలను అనుసరించి, ఆరు వారాల్లోగా అర్హులైన వారిని సంచాలకుడిగా నియమించాలని సర్కారును ఆదేశించింది.

రాష్ట్రానికి చేరుకున్న 13 మంది జాలర్లు

అడయార్, జనవరి 9: శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన రాష్ట్రానికి చెందిన 13 మంది జాలర్లు క్షేమంగా నగరానికి చేరుకున్నారు. వీరికి ఎయిర్‌పోర్టులో మత్స్య శాఖ అధికారులు స్వాగతం పలికి, ఆ తర్వాత వారి సొంతూర్లకు పంపించారు. నాగపట్టినం జిల్లాకు చెందిన 8 మంది జాలర్లు, కారైక్కాల్ ప్రాంతానికి చెందిన ఐదుగుర్లు జాలర్లను గత యేడాది డిసెంబరు నెల 6న శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. అంతర్జాతీయ సముద్ర జలాల సరిహద్దులను దాటి తమ సముద్రంలో చేపల వేట సాగించారంటూ వారిని అరెస్టు చేసి, ఆ తర్వాత లంక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. అయితే, ఈ జాలర్ల విడుదలకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ జోక్యం చేసుకుని, ఈ జాలర్లను విడిపించేలా చర్యలు తీసుకోవడంతో 13 మంది జాలర్లను లంక ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత కొలంబోలోని భారత రాయబార కార్యాలయం ఈ జాలర్లను ఎయిర్ ఇండియా విమానంలో చెన్నైకు పంపించింది.

సిటీ బస్సులు ఢీకొని ఇద్దరి మృతి

ప్యారీస్, జనవరి 9: రాజధాని నగరంలో సోమవారం అర్థరాత్రి వేర్వేరు ప్రాంతాల్లో సిటీ బస్సులు ఢీకొన్న ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. ట్రాఫిక్ విభాగం పోలీసుల కథనం మేరకు... బ్రాడ్‌వే నుంచి వడపళని వైపుకు బయల్దేరిన 15ఎఫ్ అనే సిటీ బస్సు అర్థరాత్రి కోయంబేడు బస్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో, ప్రవేశద్వారం వద్ద రోడ్డు దాటేందుకు యత్నించిన వ్యక్తిని ఢీకొనడంతో తీవ్రగాయాలతో అతను అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న ట్రాఫిక్ విభాగం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి జరిపిన విచారణలో, మృతుడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన పెరియస్వామి (57) అని తెలిసింది. అదే విధంగా ట్రిప్లికేన్ బెల్స్ రోడ్డులో రోడ్డు దాటుతూ సిటీ బస్సు ఢీకొనడంతో అదే ప్రాంతానికి చెందిన అన్నాదురై (50) మరణించాడు. చేపాక్కం పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

అడయార్, జనవరి 9: ఒక యువతిని లైంగికంగా వేధించడమే కాకుండా కులం పేరుతో దూషించిన కేసులో ప్రధాన నిందితుడైన మోహనముత్తు (25)ను చెన్నై ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేశారు. రామనాథపురం జిల్లా పరమకుడికి చెందిన మోహనముత్తుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మోహనముత్తు పోలీసుల కన్నుగప్పి సింగపూర్‌కు పారిపోయాడు. దీంతో మోహనముత్తు పరారీలో ఉన్న నిందితుడిగా ప్రకటించి, అన్ని ఎయిర్‌పోర్టులకు సందేశాలు పంపించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సింగపూర్ నుంచి చెన్నైకు వచ్చిన మోహనముత్తును ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించగా, వారు రామనాథపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎనిమిదేళ్ల తర్వాత మోహన ముత్తును అరెస్టు చేశారు.

చిత్రజ్యోతి

నన్ను క్షమించు స్వామీ...

కెప్టెన్ సమాధి వద్ద హీరో విశాల్ భావోద్వేగం

కెప్టెన్ విజయకాంత్ మరణించిన సమయంలో తాను చెన్నైలో లేనని, నిజానికి ఆయన అంత్యక్రియలను దగ్గరుండి పూర్తి చేయాల్సిందని, కానీ ఏమీ చేయలేకపోయానని అందుకే ఆయన్ను క్షమించమని కోరుతున్నట్టు హీరో విశాల్ చెప్పారు. విజయకాంత్ మృతి చెందిన సమయంలో విశాల్ అమెరికాలో ఉన్నారు. దీంతో ఆయన అంత్యక్రియల్లో పాల్గొనలేకపోయారు. చెన్నైకి వచ్చిన ఆయన మంగళవారం ఉదయం కోయంబేడులోని కెప్టెన్ సమాధికి పూల మాల వేసి అంజలి ఘటించారు. ఆ తర్వాత ఆయన తన సొంత ఖర్చులతో 500 మందికి అన్నదానం చేశారు. విశాల్ వెంట హీరో ఆర్య కూడా ఉన్నారు. ఆ తర్వాత విశాల్ మాట్లాడుతూ... కేవలం సినిమా ప్రపంచంలోనే కాకుండా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి కెప్టెన్ విజయకాంత్. సాధారణంగా ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత దేవుడిగా భావిస్తాం. కానీ, విజయకాంత్ జీవించివున్నపుడే దేవుడయ్యారు. ఆయన చనిపోయిన సమయంలో నేను నగరంలో లేను. అంత్యక్రియల్లో స్వయంగా పాల్గొని అన్ని పనులు చేసి ఉండాల్సింది. కానీ, ఏమీ చేయలేకపోయా. చివరి చూపునకు నోచుకోలేకపోయా. అందుకే నన్ను క్షమించమని వేడుకుంటున్నా. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినప్పటికీ మన మనస్సుల్లో మాత్రం చిరస్థాయిగా నిలిచి ఉంటారు. నడిగర్ సంఘం భవనానికి కెప్టెన్ పేరును పెట్టేందుకు ఏ ఒక్కరూ ఆక్షేపణ తెలపకపోవచ్చు. ఈ విషయంలో కచ్చితంగా భిన్నాభిప్రాయాలు ఉండవని భావిస్తున్నా. దీనిపై త్వరలోనే ఒక ప్రకటన వస్తుంది. అదే సమయంలో విజయకాంత్‌కు 'భారతరత్న' పురస్కారాన్ని ఇస్తారో లేదో తెలియదు..కానీ భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఆయనకు నివాళి అర్పించారు' అని పేర్కొన్నారు.


మీడియా సమావేశంలో విశాల్, ఆర్య తదితరులు

'ఈ మెయిల్' వచ్చాక చెట్ల నరికివేత తగ్గింది

● కె.భాగ్యరాజ్

ఇంటర్నెట్‌లో 'ఈ మెయిల్' సదుపాయం అందుబాటులోకి వచ్చిన తర్వాత చెట్లు నరకడం తగ్గిపోయిందని ప్రముఖ సినీ దర్శక హీరో కె.భాగ్యరాజ్ అన్నారు. ఎస్ఆర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత ఎస్.ఆర్.రాజన్ స్వీయనిర్మాణంలో తెరకెక్కిన చిత్రం 'ఈ మెయిల్'. కన్నడ నటి రాగిణి ద్వివేది ప్రధాన పాత్రను పోషించారు. 'మురుగ' ఫేం అశోక్ కుమార్ హీరోగా నటించారు. రెండో హీరోయిన్‌గా భోజ్‌పురి నటి ఆర్తి శ్రీ, రెండో హీరోగా ఆదవ్ బాలాజి నటించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను సోమవారం రాత్రి చెన్నైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దర్శక హీరో కె.భాగ్యరాజ్, నిర్మాత కె.రాజ్, మదురాజ్, నటీనటులు అరుళ్‌దాస్, నటి వనితా విజయకుమార్, కోమల్‌శర్మ, రత్నా, లొల్లు సభ మనోహర్, చిదంబరం, ఆరెంజ్ మిఠాయ్ ప్రభ, ముత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ... 'రాజకీయాల్లో రాణించాలంటే వాగ్ధాటి ముఖ్యం. సినిమా రంగానికి కథా రచన కీలకం. దర్శక నిర్మాత ఎస్ఆర్ రాజన్ ఈ విషయాన్ని చక్కగా చేసి ఉంటారని భావిస్తున్నా' అని అన్నారు. నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ... 'ఇది ఒక చిన్న సినిమాగా భావించా. కానీ, ఈ ట్రైలర్ చూశాక ఎంతో రిచ్‌గా ఉంది. మంచి మసాలా చిత్రం. ఇందులో హీరోయిన్‌గా నటించిన రాగిణి ద్వివేది ఈ కార్యక్రమానికి రాలేదు. తాము నటించిన చిత్రాలను ప్రమోట్ చేసుకునేందుకు కూడా హీరోయిన్లు రాకపోవడం విచారకరం. ఇతర సినిమా షూటింగుల్లో ఉంటే వారిని సంప్రదించిన తర్వాతే ఇలాంటి వేడుకలు నిర్వహించి, వారు వచ్చేలా నిర్మాతలు ప్లాన్ చేసుకోవాలి' అని సూచించారు. అలాగే, దర్శక నిర్మాత ఎస్ఆర్ రాజన్ మాట్లాడుతూ... 'ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లర్. యాక్షన్, కామెడీ, సెంటిమెంట్ ఇలా అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి. మూడు ఫైట్స్ ఉన్నాయి. ముంబై, గోవా, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి ప్రాంతాల్లో తెరకెక్కించాం. ఇది ఆన్‌లైన్ గేమ్ మోసానికి సంబంధించిన స్టోరీ. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది' అని పేర్కొన్నారు.

'ఈ మెయిల్' ఆడియో విడుదల దృశ్యం



11 చిత్రాలకు కలిసి పనిచేసిన ఏ.ఎల్.విజయ్ - జీవీ

సాధారణంగా చిత్రపరిశ్రమలో ఇద్దరు టెక్నీషియన్లు కలిసి వరుసగా పని చేయడమనేది చాలా అరుదు. కానీ, కోలీవుడ్‌లో దర్శకుడు ఏ.ఎల్.విజయ్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఏకంగా 11 చిత్రాలకు కలిసి పని చేశారు. ఈ విషయాన్ని తాజాగా జీవీ ప్రకాష్ కుమార్ స్వయంగా వెల్లడించారు. విజయ్ దర్శకత్వంలో అరుణ్ విజయ్ హీరోగా నటించిన 'మిషన్ చాప్టర్-1' మూవీ సంక్రాంతికి విడుదల కానుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించారు. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో జీవీ ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ... 'నేను సంగీతం సమకూర్చిన తొలి చిత్రం 'వెయిల్'. కానీ, ఈ సినిమా విడుదలకు ముందే విజయ్ దర్శకత్వం వహించిన 'కిరీటం' చిత్రంలో తొలిసారి మ్యూజిక్ డైరెక్టరుగా అవకాశం ఇచ్చారు. హీరో అజిత్, దర్శకుడు భావించివుంటే మరో సంగీత దర్శకుడికి అవకాశం ఇచ్చేవారు. కానీ, కొత్త సంగీత దర్శకుడిగా నాకు ఇచ్చిన ఆ అవకాశాన్ని జీవితంలో ఎన్నటికీ మరచిపోలేను. ఆ తర్వాత విజయ్ దర్శకత్వంలో వచ్చిన 'మదరాసపట్టినం', 'తాండవం', 'సైవం', 'దైవతిరుమగల్', 'తలైవి' ఇలా ఏకంగా 11 చిత్రాలకు కలిసి పనిచేశాం. ఈ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాల్లోని మెజార్టీ పాటలు సూపర్‌హిట్ అయ్యాయి' అని పేర్కొన్నారు.


జీవీ ప్రకాష్ కుమార్

రాష్ట్రంలోనే అతిపెద్ద మల్టీప్లెక్స్ థియేటర్

రాష్ట్రంలోనే అతిపెద్ద మల్టీప్లెక్స్ సినిమా థియేటర్‌ను కోయంబత్తూరులో నిర్మించారు. ఇందులో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించారు. ఈ థియేటర్‌ను రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాత షెణ్బగమూర్తి, థియేటర్ యజమాని సతీష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. థియేటర్ మొత్తం కలియ తిరిగి, సౌకర్యాలను మెచ్చుకున్నారు. మొత్తం 9 స్క్రీన్లు కలిసిన ఈ బ్రాడ్వే మల్టీప్లెక్స్ థియేటర్ కాంప్లెక్స్‌లో అతిపెద్ద స్క్రీన్, లేజర్ స్క్రీన్, ఐమ్యాక్స్ స్క్రీన్, ది బెస్ట్ సౌండ్ సిస్టమ్, హైక్లాస్ సీటింగ్.. ఇలా అంతర్జాతీయ స్థాయికి ఏమాత్రం తీసిపోకుండా కల్పించారు. ఈ మల్టీప్లెక్స్ థియేటర్ కాంప్లెక్స్‌ను చూసిన షెణ్బగమూర్తి.. థియేటర్ యజమానులను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సౌకర్యాలతో కూడిన మల్టీప్లెక్స్ థియేటర్ రాజధాని చెన్నైలో కూడా లేదని సతీష్ కుమార్ అన్నారు.


'బ్రాడ్వే' థియేటర్‌లో షెణ్బగమూర్తి, సతీష్ కుమార్ తదితరులు

పొంగి ప్రవహిస్తున్న తామ్రభరణి

● వరద హెచ్చరికలు జారీ

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో సోమవారం నుండి మళ్ళీ వర్షాలు ప్రారంభమయ్యాయి. దక్షిణాది జిల్లాల్లో మంగళవారం ఉదయం చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. ఆ నదీ జలాలు కైలాసపురం వద్దనున్న పెరుమాళ్ రాతిమండపం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో తామ్రభరణి పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు తూత్తుకుడి జిల్లా కలెక్టర్ లక్ష్మీపతి వరద హెచ్చరికలు జారీ చేశారు. తిరునల్వేలిలో కురిసిన వర్షాల కారణంగా తామ్రభరణి నదిలోకి వర్షపు జలాలు అధికంగా ప్రవేశిస్తున్నాయని చెప్పారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతుండటంతో నది సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని పేర్కొన్నారు. ఉప్పారు తదితర తీర ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతదాకా తామ్రభరణిలో ఎవరూ స్నానం చేయడానికి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కాగా తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో గత ఏడాది డిసెంబర్ రెండో వారంలో భారీగా వర్షాలు కురవడంతో ఆ జిల్లాల్లోని జలాశయాలలో నీటి మట్టం విపరీతంగా పెరిగింది. ఆ జలాశయాల్లోని నీరంతా తామ్రభవరణి నదిలోకి చేరడంతో వరద పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమయంలో ఆ నదికి చేరువగా పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.


కైలాసపురం పెరుమాళ్ రాతిమండపం చుట్టూ ప్రవహిస్తున్న తామ్రభరణి జలాలు

రామ్‌రాజ్ కాటన్ అవగాహన ఒప్పందం

● రూ.1000 కోట్ల పారిశ్రామిక పెట్టుబడి

అడయార్, జనవరి 9: స్థానిక నందంబాక్కంలో ట్రేడ్ సెంటరులో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమావేశంలో ప్రసిద్ధ వస్త్ర తయారీ సంస్థ 'రామ్‌రాజ్ కాటన్' అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం స్టాలిన్ సారథ్యంలో జరిగిన ఈ సదస్సులో రామ్‌రాజ్ కాటన్ ఆధ్వర్యంలో వచ్చే ఐదేళ్లలో రూ.1000 కోట్ల పారిశ్రామిక పెట్టుబడి పెట్టడంతో పాటు చేనేత ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి 5,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ అవగాహన ఒప్పంద పత్రాలను సీఎం సమక్షంలో రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకుడు కేఆర్ నాగరాజన్ సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ ఒప్పందంపై నాగరాజన్ మాట్లాడుతూ... తమిళనాడు ప్రభుత్వంతో కలిసి పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ప్రగతి పథం, అభివృద్ధి పథంపైపు నడిపించేందుకు ఇదొక గొప్ప అవకాశంగా భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



సీఎం సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్న రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకుడు కేఆర్ నాగరాజన్

పళని ఆలయానికి 'క్యూ ఆర్' కోడ్ ద్వారా విరాళాలు

పెరంబూర్, జనవరి 9: పళని దండాయుధపాణి ఆలయాన్ని సందర్శించే భక్తులు 'క్యూ ఆర్' కోడ్ ద్వారా విరాళాలు అందించే వసతి కల్పించారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తున్న వేలాది మంది భక్తులు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా స్వామివారికి కానుకలు సమర్పిస్తుంటారు. అలాగే, ఆలయానికి వచ్చే భక్తులకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం చేస్తున్నారు. ఈ అన్నదానం కార్యక్రమానికి కూడా భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, భక్తులు తమ సెల్‌ఫోన్ వినియోగించి క్యూ ఆర్ కోడ్ ద్వారా విరాళాలు చెల్లించే సౌకర్యాన్ని ఆలయ నిర్వాహకులు పరిచయం చేశారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణం, రోప్ కార్ స్టేషన్ సహా పలు ప్రాంతాల్లో క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్టిక్కర్లు ఏర్పాటుచేశారు. ఈ ప్రక్రియకు భక్తుల నుంచి మంచి స్పందన వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్

పళని హుండీ ఆదాయం రూ.2.62 కోట్లు

ఐసీఎఫ్, జనవరి 9: దిండుగల్ జిల్లా పళని సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2.62 కోట్లు అని నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఏర్పాటుచేసిన హుండీల్లో భక్తులు చెల్లించే కానుకలను లెక్కిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం అధికారుల సమక్షంలో జరిగిన లెక్కింపులో, రూ.2,68,11,653 నగదు, 651 గ్రాముల బంగారం, 12.525 కిలోల వెండి, 687 విదేశీ కరెన్సీని భక్తులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

వాస్కో మ్యాగజీన్ చెన్నై ఎడిషన్ ప్రారంభం

అడయార్, జనవరి 9: పుదుచ్చేరి కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న వాస్కో తాజాగా వాస్కో మ్యాగజీన్ చెన్నై ఎడిషన్‌ను తాజాగా ప్రారంభించింది. స్థానిక నుంగంబాక్కంలోని హెర్మోసో స్టూడియోలో ఈ ఎడిషన్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించగా, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా భావించే 'వాస్కో పీపుల్స్ చాయిస్ అవార్డు-2023'లను కూడా ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో చెన్నై ఆర్కాట్ ప్రిన్స్ మహ్మద్ అసిఫ్ అలీ, వాస్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్వీ ఆనంద్, నేచురల్ సెలూన్ కో ఫౌండర్, సీఈవో సీకే కుమారవేల్, అడిషినల్ చీఫ్ సెక్రటరీ రాధాకృష్ణన్, అయేషా యాక్సెసరీస్, రెడ్ ఎర్త్ రైడింగ్ స్కూల్ ఫౌండర్ జాక్వెలినా కఫూర్, పుదుచ్చేరి ఎడిషన్ వాస్కో మ్యాగజీన్ ఎడిటర్ పీపై కఫే, సినీ నిర్మాత, చెన్నై వాస్కో మ్యాగజైన్ ఎడిటర్ కవిత పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.



'వాస్కో పీపుల్స్ చాయిస్ అవార్డు-2023' గ్రహీతలు

ఘనంగా హిందూ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం


విద్యార్థినికి పుస్తకాల బహూకరణ

అడయార్, జనవరి 9: స్థానిక పట్టాభిరాంలో ఉన్న డీఆర్‌బీసీసీసీ హిందూ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో కాలేజీ కార్యదర్శి వెంకటేశ్ పెరుమాళ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికీ విద్యను అందించడమే లక్ష్యంగా డీఆర్‌బీసీసీసీ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు.నగర శివార్లలో ఉండే అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యా అవకాశాలను కల్పించాలన్న ఏకైక లక్ష్యంతో కలవల కన్నన్ చెట్టి ఈ విద్యా సంస్థలను స్థాపించారని, నాటి నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులు డిగ్రీలు అందుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు.ఇపుడు విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు దేశాభివృద్ధికి తమంతు సహకారం అందించాలని కోరారు.ఆ తర్వాత పరిశోధనాభివృద్ధి కేంద్ర సంచాలకుడు డాక్టర్ ఎన్.రాజేంద్ర నాయుడు మాట్లాడుతూ...ఈ ధార్మిక సంస్థ గత శతాబ్ది కాలంగా అనేక దానధర్మాలు చేస్తూ విద్యార్థుల కోసం అనేక విద్యా సంస్థలను నడుపుతోందని, అదే కన్నన్ చెట్టి ఆశయమన్నారు.ఈ కార్యక్రమంలో కాలేజీలోని తెలుగు, తమిళం, హిందీ, ఆంగ్ల భాషా శాఖలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులనను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జి.కల్పిక్కరసితో పాటు వివిధ శాఖలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేశారు.


వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మద్రాసు వర్శిటీలో సంక్రాంతి సంబరాలు



చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లోని మద్రాసు విశ్వవిద్యాలయంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో డిగ్రీ, పీజీ విద్యార్థినులంతా తమిళ సంప్రదాయాన్ని ఎలుగెత్తి చాటేలా పట్టు వస్త్రాలు ధరించి పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని విద్యార్థినులు పోటీపడి రంగురంగుల ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత కొత్త కుండలో పొంగలి వండులూ పాటలు పాడి సందడి చేశారు. చెరకు గడలను చేత పట్టుకుని 'పొంగలో... పొంగల్' అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఆ తర్వాత విద్యార్థినులంతా చక్కెర పొంగలిని రుచి చూస్తూ ఆటపాటలతో అందరినీ అలరించారు.


ముగ్గులేస్తున్న పీజీ విద్యార్థినులు



కొత్త కుండలో పొంగలి వండుతున్న విద్యార్థినులు - పొంగలి కుండ చుట్టూ చేరి 'పొంగలో పొంగల్' అంటున్న విద్యార్థినులు

ఆలయ అర్చకులు, సిబ్బంది సహా 12 వేలమందికి కొత్త దుస్తులు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయాల్లో సేవలందించే అర్చకులు, సిబ్బంది సహా 12 వేలమందికి కొత్త దుస్తుల పంపిణీకి దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు శ్రీకారం చుట్టారు. మంగళవారం ప్యారీస్ కార్నర్ తంబుచెట్టి వీధిలోని సుప్రసిద్ధ కాళికాంబాళ్ ఆలయంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని చెన్నై జోన్‌లోని 74 ఆలయాల్లో పనిచేస్తున్న 128 మంది అర్చకులు, భట్టాచార్యులు, ఓదువార్లు, పూజారులకు కొత్త దుస్తులను పంపిణీ చేశారు. అదే విధంగా ఈ ఆలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు సిబ్బందికి కూడా యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 12911 మంది అర్చకులు, సిబ్బందికి కొత్త దుస్తులు, యూనిఫాం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళికాంబాళ్ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఈ.ఎం.మోహన్ ఆచ్చారి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కాళికాంబాళ్ ఆలయంలో అర్చకులకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ మోహన్‌ఆచ్చారి

భోగిలో ప్లాస్టిక్, రబ్బరు వస్తువులు కాల్చొద్దు


● మేయర్ పిలుపు

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో కాలుష్యరహితంగా భోగిపండుగను జరుపుకోవాలని, ఎట్టి పరిస్థితులలోనూ పాత రబ్బరు, టైర్లు, ప్లాస్టిక్ వస్తువులను కాల్చకూడదని విద్యార్థినులకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం టి.నగర్ బర్కిత్‌రోడ్డులోని శారదా ఆదర్శ విద్యాలయ బాలికల మహోన్నత పాఠశాలలో కాలుష్యం లేని భోగిపై విద్యార్థినుల అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఇంట్లో పనికరాని వస్తువులను మాత్రమే ప్రత్యేకించి పాత బుట్టలు, కొయ్య పరికరాలను కాల్చి భోగి పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి.నగర్ ఎమ్మెల్యే జె.కరుణానిధి, కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్, ఎక్స్‌నోరా సంస్థ నిర్వాహకుడు శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.


టి.నగర్ శారదా విద్యాలయ ఆదర్శ బాలికల మహోన్నత పాఠశాల వద్ద కాలుష్య రహిత భోగి పండుగపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీసీసీ మేయర్

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిస్టెన్స్ డిప్లొమాలు



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) - డిప్లొమా, అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని డిస్టెన్స్, ఆన్‌లైన్ మోడ్‌లలో నిర్వహిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో కనిష్ఠంగా 50 సీట్లు ఉంటాయి. అకడమిక్ ప్రతిభ, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్
- డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్
- డిప్లొమా ఇన్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్
- డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్
- డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ పంచాయతీ రాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్
- డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్
- డిప్లొమా ఇన్ టెలీకాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్

అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ గవర్నెన్స్
- డిప్లొమా ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్

ప్రోగ్రామ్‌ల వివరాలు: ఒక్కో డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు టర్మ్‌లు ఉంటాయి. ప్రతి టర్మ్‌లో అయిదు నుంచి పది రోజులపాటు కాంటాక్ట్ క్లాసెస్ నిర్వహిస్తారు. వీటికోసం అభ్యర్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లకు హాజరు కావచ్చు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా వినవచ్చు. ప్రాక్టికల్ సెషన్స్ కూడా ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రతి ప్రోగ్రామ్‌లో స్టడీ సెమినార్‌లు, కౌన్సెలింగ్ సెషన్స్, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామినేషన్‌లు ఉంటాయి.

- సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్ వ్యవధి ఆర్నెల్లు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** cdvl.uohyd.ac.in

పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ కేజీపీ), కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంసీ), ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్‌ఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్(పీజీడీబీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ముందుగా కోల్‌కతా ఐఐఎంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్, ప్రీ సెమిస్టర్ మాడ్యూల్ నిర్వహిస్తారు. ఐఎస్‌ఐలో మొదటి సెమిస్టర్, ఐఐటీ కేజీపీలో రెండో సెమిస్టర్, ఐఐఎం కోల్‌కతాలో మూడో సెమిస్టర్ చదవాల్సి ఉంటుంది. నాలుగో సెమిస్టర్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 65 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌లను అనుమతిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంకాం ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ డిప్లొమా తరవాత లేటరల్ ఎంట్రీ ద్వారా మూడేళ్ల ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు; సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వెర్బల్ ఎబిలిటీ నుంచి 15, లాజికల్ రీజనింగ్ నుంచి 5, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ డేటా విజువలైజేషన్ నుంచి 5, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 150. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంపిక: అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్ స్కోర్‌కు 45 శాతం, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులకు 40 శాతం, ఇంటర్/డిప్లొమా స్థాయి మార్కులకు 8 శాతం, అనుభవానికి 7 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.25 లక్షలు(ట్యూషన్ ఫీజు+క్యాంపస్ లాడ్జింగ్+బుక్స్+స్టడీ మెటీరియల్+ఎగ్జామినేషన్ మెటీరియల్స్+ల్యాబొరేటరీ ఛార్జీలు)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 6
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** isical.ac.in, iitkgp.ac.in, iimcal.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5ysEkHmలో చదవండి.

రిమైండర్

ఏపీపీఎస్సీ నోటిఫికేషన్స్

గ్రూప్-1 సర్వీస్ పోస్టులు

ఖాళీలు 81

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ దరఖాస్తులు స్వీకరిస్తోంది.

శాఖల వారీ ఖాళీలు

1. డిప్యూటీ కలెక్టర్(ఏపీ సివిల్ సర్వీస్- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్): **9 పోస్టులు**
2. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్(ఏపీ స్టేట్ ట్యాక్స్ సర్వీస్): **18 పోస్టులు**
3. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్)(ఏపీ పోలీస్ సర్వీస్) కేటగిరీ-2: **26 పోస్టులు**
4. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(మెన్)(ఏపీ జైల్ సర్వీస్): **1 పోస్టు**
5. డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్: **1 పోస్టు**
6. రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఏపీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్): **6 పోస్టులు**
7. డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ బీసీ వెల్ఫేర్ సర్వీస్): **1 పోస్టు**
8. డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ సోషల్ వెల్ఫేర్ సర్వీస్): 3 పోస్టులు
9. డిప్యూటీ రిజిస్ట్రార్(ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్): **5 పోస్టులు**
10. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2(ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్): **1 పోస్టు**
11. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఏపీ ఎక్సైజ్ సర్వీస్): **1 పోస్టు**
12. అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్(ఏపీ ట్రెజరీ అకౌంట్స్ సర్వీస్): **3 పోస్టులు**
13. డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్(ఏపీ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సర్వీస్): **4 పోస్టులు**
14. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(ఏపీ స్టేట్ ఆడిట్ సర్వీస్): **2 పోస్టులు**

అర్హతలు: పూర్తి సమాచారం నోటిఫికేషన్‌లో చూడొచ్చు
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
చివరి తేదీ: జనవరి 21 **స్క్రీనింగ్ టెస్ట్(ప్రిలిమినరీ ఎగ్జామినేషన్):** మార్చి 17
వెబ్‌సైట్: psc.ap.gov.in/

డిగ్రీ లెక్చరర్స్

ఖాళీలు 240

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)..ఏపీ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

సబ్జెక్టుల వారీగా ఖాళీలు

1. బోటనీ: 19 2. కెమిస్ట్రీ: 26 3. కామర్స్: 35
4. కంప్యూటర్ అప్లికేషన్స్: 26 5. కంప్యూటర్ సైన్స్: 31
6. ఎకనామిక్స్: 16 7. హిస్టరీ: 19 8. మేథమెటిక్స్: 17
9. ఫిజిక్స్: 11 10. పొలిటికల్ సైన్స్: 21 11. జువాలజీ: 19

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు
రాత పరీక్ష తేదీ: 2024 ఏప్రిల్/మే **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in/

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు

ఖాళీలు 38

ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) విడుదల చేసింది.

అర్హత: ఏదైనా పీజీతోపాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి
దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.370, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.250.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29
స్క్రీనింగ్ పరీక్ష తేదీ: ఏప్రిల్ 13 **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

SCHOLARSHIP ALERT

TSDPL Silver Jubilee Scholarship Program

Description: Tata Steel Downstream Products Limited (TSDPL) invites applications from students who are domiciles of Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata. The scholarship is meant to support meritorious students from low income families to continue their education.

Eligibility: Open for students who are domiciles of locations such as Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata are eligible to apply. Applicants must be pursuing any year of ITI/diploma, graduation or postgraduation in fields such as Nursing, UG medical courses such as MBBS, BDS, PG medical courses (any specialization), paramedical courses, ITI/diploma subjects such as fitter, electrical, welders, safety, etc. from government-recognized institutes. Must have scored at least 60% marks in their Class 10 and 12 examination. Annual family income of the applicants must not be more than INR 5,00,000 from all sources.

Prizes & Rewards: INR 1,00,000 for 1 year ***Last Date to Apply:*** 21-01-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/TSDPL2

PROMYS India
(Program in Mathematics for Young Scientists)



Description: PROMYS India (Program in Mathematics for Young Scientists), India 2024 is an opportunity offered in partnership with the Indian Institute of Science (IISc), Bengaluru, for students in Class 9 to 12. The selected students will be awarded a full scholarship covering all tuition, housing, and meals for the six weeks of the programme.

Eligibility: Open for students aged 15 years or older by May 5th, 2024, currently enrolled in Class 9 to 12 (or equivalent) at any recognised secondary or higher secondary school across India. Applicants must have completed (or be in) Class 9 before the program begins.

Prizes & Rewards: A full scholarship covering tuition, housing, and meals for the six weeks of the programme
Last Date to Apply: 01-02-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/POR1

Piaggio "Shiksha Se Samriddhi" Program

Description: An initiative of Piaggio Vehicles Pvt. Ltd. to support the STEM education of female students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar.

Eligibility: Open to female students pursuing STEM courses.

- Students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar can apply for the scholarship.
- Final-year students enrolled in graduation, post-graduation and diploma will be eligible under this program.
- Students must have scored at least 50% marks in their previous class.
- The annual income of the family should be less than INR 4 lakh.

Note: Children of employees of Piaggio and Buddy4Study are not eligible to participate.

Prizes & Rewards: INR 15000 - INR 20,000 (based on actuals)
Last Date to Apply: 20-01-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/PSD5

buddy4study.com



ఈసారి కూడా బాగా గట్టిగా కొడతాం

మహేశ్‌బాబు

"**నా**కూ, నాన్నగారికీ సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండుగ. సంక్రాంతికి విడుదలైన మా సినిమాలు బ్లాక్‌బస్టర్లయ్యాయి. ఈ సారి కూడా బాగా గట్టిగా కొడతాం. కానీ ఈ సారి 'గుంటూరు కారం' చిత్రం రికార్డులు, వసూళ్ల గురించి మాట్లాడడానికి నాన్న మన మధ్య లేరనే వెలితి ఉంది. ఆ లోటును ఇక మీరే (అభిమానులు) తీర్చాలి. ఇకపై నాకు అమ్మా, నాన్నా... అన్నీ మీరే' అని మహేశ్‌బాబు భావోద్వేగంతో స్పందించారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 12న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం గుంటూరులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మాట్లాడుతూ "త్రివిక్రమ్ అంటే నాకు చాలా ఇష్టం. గత రెండేళ్లు ఆయన నాకు అండగా నిలిచిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన సినిమాల్లో చేసేటప్పుడు నా నటనలో ఏదో మ్యాజిక్ జరుగుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాల తరహాలో ఇప్పుడు 'గుంటూరు కారం'లోనూ అదే మ్యాజిక్ జరిగింది. ఇందులో మీరు కొత్త మహేశ్‌బాబును చూడబోతున్నారు. దానికి కారణం త్రివిక్రమే. మా నిర్మాత చినబాబు ఇష్టపడే హీరోని నేనే. వారితో మరిన్ని గొప్ప సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. చాలా రోజుల తర్వాత మన తెలుగు అమ్మాయి శ్రీలీల పెద్ద హీరోయిన్ కావడం గొప్ప విషయం. ఆ అమ్మాయితో డాన్స్ చేయాలంటే హీరోలందరికీ తాట ఊడిపోద్ది. థమన్ బెస్ట్ సాంగ్స్ ఇచ్చాడు' అని తెలిపారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఒక సినిమాకు వంద శాతం పనిచేయాలంటే రెండొందల శాతం పనిచేసే హీరో ఎవరైనా ఉన్నారంటే అది మహేశ్‌బాబే. పాతికేళ్లయింది అంటున్నారు కానీ ఆయన్ను చూస్తుంటే నిన్నో, మొన్నో సినిమాల్లోకి వచ్చిన హీరోలానే ఉన్నారు. సూపర్‌స్టార్ కృష్ణగారు గొప్ప నటుడు. ఆయన నటించిన ఒక సినిమాకు సహాయ రచయితగా పనిచేశాను. అంత గొప్ప మనిషికి కొడుకుగా పుట్టిన మహేశ్‌బాబు ఎంత అదృష్టవంతుడో కదా అనిపిస్తుంది. 'అతడు, ఖలేజా' సినిమాలకు పనిచేసినప్పుడు మహేశ్ ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలానే ఉన్నారు. నటనలోనూ అదే స్పీడ్ చూపిస్తున్నారు. షూటింగ్ తర్వాత బాగా అలసిపోయి కూడా మిమ్మల్ని కలుసుకోవడానికి గుంటూరు వచ్చారు. జనవరి 12న థియేటర్లలో కలుద్దాం. సంక్రాంతిని ఈసారి రమణగాడితో కలసి చేసుకుందాం' అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ 'నాకు ఈ సినిమా మళ్లీ రీలాంచ్‌లా అనిపిస్తోంది. మహేశ్‌బాబు బంగారపు విగ్రహానికి ప్రాణం పోసినట్లు ఉంటారు. ఆయన మనసు కూడా అంతే అందమైనది' అని చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'మేకర్స్‌గా చినబాబు, వంశీ ప్రయాణం అద్భుతంగా ఉంది. త్రివిక్రమ్ ఈ సినిమాతో కలెక్షన్ల తాట తీస్తాడు. మహేశ్‌బాబు మరో బ్లాక్‌బస్టర్ చిత్రం ఇస్తున్నారు' అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'త్రివిక్రమ్‌తో పనిచేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది. ఆయనను అందరూ గురూజీ అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమవుతోంది. మహేశ్‌బాబు గారి సినిమాలో చేయాలని అడిగినప్పుడు షాక్ తిన్నాను. ఆయనతో నటించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. ఇది మహేశ్‌గారి మాస్ ఫిల్మ్' అని అన్నారు.

రేకుల షెడ్డు కూలి అభిమానులకు గాయాలు

గుంటూరు జిల్లాలోని పెదకాకాని సమీపంలో మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో మంగళవారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. అంచనాలకు మించి భారీగా మహేష్ బాబు అభిమానులు రావడంతో, సభ ప్రాంగణం మొత్తం కనుచూపు మేర జనసంద్రంగా మారిపోయింది. దీంతో ప్రాంగణం కుడి వైపున వాచ్ మెన్ కోసం నిర్మించిన రేకుల షెడ్డుపైకి పెద్ద ఎత్తున అభిమానులు ఎక్కారు. మహేష్ బాబును చూసేందుకు యువత ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో రేకుల షెడ్డు కూలిపోయింది. ఈ ఘటనలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందులో కొందరిని విజయవాడ, గుంటూరు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

- పెదకాకాని

నవ్య | చిత్రజ్యోతి

వరాలు అందరికీ నచ్చుతుంది..



'**ఇం**దులో నాపేరు వరాలు. స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయిని. పల్లెటూరి అమ్మాయిలంటే సాధారణంగా సున్నితంగా ఉంటారు. కానీ నేను మాత్రం ఇందులో రెబల్. సినిమా చూసినవాళ్లు 'అమ్మాయి అంటే ఇలా ఉండాలి' అనేలా నా పాత్ర ఉంటుంది' అని అషిక రంగనాథ్ అన్నారు. అక్కినేని నాగార్జున కథానాయకుడిగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన 'నా సామిరంగ' చిత్రంలో అషిక కథానాయికగా నటించారు. జనవరి 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో ముచ్చటించారు. 'నాలాంటి కొత్తమ్మాయికి నాగార్జునగారి లాంటి టాప్‌స్టార్‌తో నటించే అవకాశం రావడం నిజంగా అదృష్టం. నా కేరక్టర్‌లో రెండు కోణాలుంటాయి. కొంతభాగం యంగ్‌స్టర్‌గా, కొంతభాగం ప్రౌఢగా కనిపిస్తాను. నటనలోనే కాదు, ఆహార్యంలో కూడా తేడా ఉంటుంది. కష్టపడి చేశాను. ఇంత అద్భుతమైన పాత్ర దక్కడం నా అదృష్టం.' అంటూ ఆనందం వెలిబుచ్చారు అషిక.

మొయినుద్దీన్ రాక అప్పుడే...



క్రీడలకు మత మౌఢ్యాన్ని అద్ది.. లేనిపోని వివాదాలకు తెరలేపుతూ పెడత్రోవ తొక్కుతున్న కొందరు యువకులను సన్మార్గంలో నడిపించి, వారిలో సఖ్యతను కుదిర్చే ఓ వ్యక్తి కథే 'లాల్ సలామ్'. ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ మొయినుద్దీన్ అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ముంబై నేపథ్యంలో నడిచే సినిమా ఇది. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఐశ్వర్య రజనీకాంత్ దర్శకురాలు. సుభాస్కరన్ నిర్మాత. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 9న విడుదల కానున్న ఈ పాన్‌ఇండియా సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని విభిన్న పాత్రను ఇందులో రజనీ చేసున్నారని మేకర్స్ చెబుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత క్రికెటర్ కపిల్‌దేవ్ ఇందులో ప్రత్యేకపాత్ర పోషిస్తుండటం విశేషం. జీవితా రాజశేఖర్, సెంథిల్, తంబి రామయ్య, అనంతిక, వివేక్ ప్రసన్న, తంగదురై తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ 171వ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. విశేషమేమిటంటే.. తలైవా 172కు కూడా రంగం సిద్ధమైంది. కర్ణన్, మామన్నన్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న మారి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. లోకేశ్ కనకరాజ్ సినిమా నిర్మాణం పూర్తికాగానే, ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది.

నిజాలు తెలుసుకొని వార్తలు రాయండి

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇక నుంచి మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు చిత్ర పరిశ్రమను ఇబ్బందిపెట్టేలా ఇష్టం వచ్చిన రాతలు రాస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు మంగళవారం ఆ మూడు సంస్థలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. నిజాలను నిర్భయంగా ప్రచారంలో పెట్టవచ్చు కానీ అసత్యాలు, ఈర్ష్య ద్వేషాలతో వ్యక్తుల గౌరవాన్ని దెబ్బతీయడం సరైనది కాదని లేఖలో మీడియా సంస్థలకు హితవు పలికాయి. కొన్ని వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా సంస్థలు సంక్రాంతి టైంలో వాళ్ల రేటింగ్స్ కోసం అదేపనిగా తమకు నచ్చినట్లు వార్తలు రాయడం వల్ల హీరోలు, దర్శకులు వారి అభిమానుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు, కాబట్టి ఇక నుంచి ఏ మీడియా సంస్థ అయినా వార్తలు ప్రచురించే ముందు మా మూడు సంస్థలను సంప్రదించి నిజాలు తెలుసుకోవాలని కోరాయి. సినీ ప్రముఖులు మాట్లాడేటప్పుడు పూర్తిగా అవగతం చేసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో పరిశ్రమ ఇబ్బందిపడేలా వార్తలు రాయడం విచారకరం అని పేర్కొన్నాయి. సంక్రాంతి సినిమాల మధ్య పోటీ ఆహ్లాదకరంగా ఉండాలనీ, తెలుగు సినిమా హీరోలు, దర్శకులు, నిర్మాతలు... ఎవరూ నష్టపోకూడదనీ మా మూడు సంస్థలు కలసి కృషి చేస్తుంటే సహకరించాల్సింది పోయి మీడియా సంస్థలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించాయి. తెలుగు సినీ పరిశ్రమకు పుట్టుక నుంచి మీడియాతో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందికర వ్యాఖ్యలు చేసేవారిపైన తగు చర్యలు తీసుకోవాలని సినీ పాత్రికేయ సంఘాలు, మీడియా యాజమాన్యాలను లేఖలో అభ్యర్థించాయి.

వెంకటేశ్ నట విశ్వరూపం చూస్తారు



'**జ**యాపజయాల గురించి పట్టించుకోను. ప్రయాణాన్ని మాత్రమే ఆస్వాదిస్తాను. నిజాయితీగా పనిచేస్తే విజయం అదే వస్తుంది' అంటున్నారు దర్శకుడు శైలేష్ కొలను. ఆయన దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా శైలేష్ విలేకరులతో మాట్లాడారు.

- 'హిట్2' తర్వాత వెంకటేశ్‌గారిని కలిశాను. బాగా తీశావ్ అని అభినందించారు. మేం సినిమాల కంటే జనరల్ విషయాలే ఎక్కువ మాట్లాడుకునేవాళ్లం. రెండుమూడు మీటింగ్స్‌లో మా ఇద్దరికీ మంచి బాండింగ్ ఏర్పడింది. సినిమా చేయాలనుకున్నాం. 'సైంధవ్' ఐడియా చెప్పాను. ఆయనకి బాగా నచ్చింది. 'నా 75వ సినిమా అంటే ఇలా ఉండాలి' అంటూ సంబరపడిపోయారు. ఆ లైన్ డవలప్‌చేసి పూర్తి స్క్రిప్ట్ వినిపించాను. కథ మొత్తం విని హగ్ చేసుకున్నారు. 'ఇది చేస్తున్నాం' అంటూ భుజం తట్టారు
- ఎలాంటి టెన్షన్ లేకుండా సినిమాను పూర్తి చేశాను. దానికి కారణం వెంకటేశ్‌గారే. అయితే.. ప్రమోషన్స్‌లో వెంకటేశ్‌గారి ఏవీలు చూస్తుంటే.. 'ఇంతటి అద్భుతమైన జర్నీ ఉన్న హీరోతో సినిమా చేశానా?' అని టెన్షన్ మొదలైంది. నా వరకూ దర్శకుడిగా పూర్తి సంతృప్తితో ఉన్నా. వెంకీ 75 మూవీ ఎలా ఉండాలో అలా చేశాం. ఇందులో వెంకటేశ్ విశ్వరూపం చూస్తారు. వెంకటేశ్‌గారు ఎమోషనల్‌గా చేసిన ప్రతి సినిమా హిట్టే. శత్రువు, ధర్మచక్రం, గణేశ్, తులసి.. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. ఈ సినిమా వాటిని మించేలా ఉంటుంది. ఇంత ఎమోషనల్ డెప్త్ ఉన్న కథ చేయడం నాకిదే ప్రథమం. ఇందులో వెంకటేశ్‌గారి పెర్‌ఫార్మెన్స్ ప్రేక్షకులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తుంది. హృదయాలను ద్రవింపజేసే భావోద్వేగపూరిత సన్నివేశాలు ఉన్నాయి ఇందులో.
- స్పైనల్ మస్క్యులర్ ఆట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న వారి పోరాటానికి బలమైన గొంతుకలేదు. 17కోట్ల ఇంజక్షన్ కోసం తపన పడే పేరెంట్స్ గురించి, వారి పోరాటం గురించి మనకి పెద్దగా అవగాహనలేదు. సమాజంలో ఈ విషయంపై అవగాహన పెంచాలంటే విస్తృతంగా కమ్యునికేట్‌చేసే నటులు కావాలి. వెంకటేశ్‌గారితోపాటు ఆండ్రియా, రుహానీ శర్మ లాంటి నటులు ఇందులో భాగమవ్వడానికి కారణం అదే. ఒక పవిత్రభావనతో తయారు చేసుకున్న కథ ఇది. అందుకే అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zcm5i4p లో చదవండి.